## ఫన్ నీరు
### శంకర నారాయణ



# కొంటె ప్రశ్నలడిగేవారిపై పన్నీరు 'ఫన్' నీరు

1. ఉన్నపళంగా, అమెరికాలో ఉన్న జనాభాని ఇండియాకీ, ఇండియాలో ఉన్న జనాభాని అమెరికాకీ మారిస్తే ఎలా ఉంటుంది?

*ఇండియాలో జనమంతా డాలరెగరేస్తారు..అమెరికాలో జనమంతా కనుబొమ్మలెగరేస్తారు..!*

2. మా ఆవిడ అస్తమాను నన్ను మట్టి బుర్ర అని విసుక్కుంటుంది, అసలు బుర్రలో మట్టి ఎలా ఉంటుంది?

*ఎందుకుండదూ..పెళ్ళైన క్షణం నుంచీ నెత్తిన మట్టిపోస్తుంటే..!*

3. "నవ్వు నాలుగందాలచేటు " అంటారు కదా, ఈ నాలుగు విధాలు ఏమిటి?

*ఒక అందం చూసి నవ్వితే ఫరవాలేదుకానీ నాలుగు అందాలు చూసి నవ్వితే పళ్ళు రాలడం ఖాయం. అంతకు మించిన చేటు ఏముంటుంది?*

4.మంచి వాళ్ళను "తలలో నాలుక" అంటారు, నోట్లో నాలుక అని ఎందుకనరు?

*మంచి వాళ్ళకంటే పెళ్ళైన వాళ్ళకి మీరడిగిన ప్రశ్న వర్తిస్తుంది. ఎలాగంటే - పెళ్ళైనవాళ్ళు నోరు తెరిస్తే కదా నోట్లో నాలుక కనిపించడానికి!?*

5. సంపన్నుల దగ్గర "డబ్బు మూలుగుతూ ఉంటుందని" అంటారు కదా, మీ కెప్పుడైన ఈ మూలుగు శబ్దం వినిపించిందా?

*మూలగడానికి నేనంత సంపన్నుడ్నీ కాదు.. నాకు పన్ను బాధా లేదు..!*

6. ఎమ్మెల్యే పెసరట్టు అంటారు కదా, ఎం.పి పెసరట్టు ఉండదేం?

*ఎమ్మెల్లే పెసరట్టైతే రింగురోడ్డంత ఉన్నా సరిపోతుంది. ఎం.పి పెసరట్టైతే ఢిల్లీ వరకూ సాగదియ్యాలి కదా.. అంత తట్టుకోలేమనీ..!*

7. "నాకు నగా నట్రా మీద మోజు లేదు, మావారే నాకు ఆభరణం" అనే ఆవిడ్ని పతివ్రత అని అనవచ్చా?

"సంపతి వ్రత" అంటే బావుంటుంది..

8. "లంకంత ఇల్లు" అంటారు, అంటే ఇంట్లో ఉండే వాళ్ళందరూ రాక్షసులనా అర్థం?

*కాదు..భర్త మాత్రమే ‘రవాణా ‘సురుడు అని అర్ధం..!*

9. 70 కి ముందు సినిమాల్లో, ఒక హీరో, ఇద్దరు హీరోయిన్లు ఉంటే, ఎవరో ఒక హీరోయిన్ ప్రాణ త్యాగం చేసేది. 70 తరువాత వచ్చిన సినిమాల్లో, ఒక హీరోయిన్ త్యాగం చేసి వెళ్ళిపోయేది, 90 తరువాత వచ్చిన సినిమాల్లో, ఇద్దరూ అదే హీరోతో అడ్జస్ట్ అయిపోతున్నారు, ఇక ముందు ముందు ఎలాంటి సినిమాలు వస్తాయి.

*ఎంతమంది హీరోయిన్లున్నా హీరో చచ్చినట్లు నటించాల్సిందే.!*

10. ధారావాహిక టీవీ సీరియల్ చూస్తున్న ఆడవాళ్ళని టీవీ ముందునుండీ లేపడం కష్టమా, లేక అధికారంలో ప్రభుత్వాన్ని పడగొట్టడం కష్టమా?

*"దో" చేస్తూ ఉన్నవాళ్ళను ఏమైనా చెయ్యొచ్చు కానీ చూస్తూ వున్న వాళ్ళని ఏమీ చెయ్యలేం..చూస్తూ ఉండాల్సిందే.!*

11. ప్రతి మగాడి విజయం వెనుక ఓ స్త్రీ ఉంటుందంటారు, మరి ఆ స్త్రీ వెనుక?

*పిల్లలు..!*

12. తింటే గారెలే తినాలి, వింటే భారతం వినాలి, మరి తాగితే...?

*"బీరు"పోకుండాతాగాలి..!*

---

చిలిపి ప్రశ్నలకి హాస్యబ్రహ్మ, హాస్యావధాని శంకరనారాయణ గారి నుంచీ కొంటె సమాధానాలు తెలుసుకోవాలని ఉందా!? ఇంకా ఆలశ్యమెందుకు.. మీ చిలిపి ప్రశ్నల్ని **editor@koumudi.net** కి వెంటనే పంపించండి..!!